సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం, 4, సెప్టెంబర్, 2023



గణపయ్య పండుగ.. ఉపాధి నిండుగ

వినాయచవితి ఉత్సవాలు అంటే భక్తిభావం, బొజ్జగణపయ్య పండుగ అనేక మంది బొజ్జనింపే పండుగ కూడా.

- 8లో



పెన్నాలో చిక్కుకున్న 8 మంది సురక్షితం

పెన్నానదిలో అకస్మాత్తుగా నీటి ఉధృతి ఎక్కువ కావడంతో చిక్కుకున్న 8 మంది సురక్షితంగా బయటికి వచ్చారు.

- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.150	రూ.220
రెండోరకం	రూ.90	రూ.148

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 235 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	601	601
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 18.53 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు (సోమవారం) స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఏ పరిధి దాటిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

రేపు షూటింగ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగర పరిధిలోని ఊటుకూరు టర్నింగ్‌పాయింట్ క్రీడా మైదానంలో ఈనెల 5వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మాదినేని నిత్యపూజయ్య తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9391652133 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రూ.లక్ష వితరణ



దాతలకు స్వామి చిత్రపటం అందజేత

చక్రాయపేట: గండి క్షేత్రంలోని వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయకమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. కడప నగరం మోడంపల్లెకు చెందిన దేవగుడి శ్యామసుందరరెడ్డి అయన సతీమణి పద్మజ ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డిల చేతికి విరాళం మొత్తం అందజేశారని ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో ద్వారా లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్‌కు శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. ఈ బ్యాచ్‌లో 16 మందికి శిక్షణ ఇస్తామని, 30 ఏళ్ల అనుభవంగల రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ల చేత థియరీ క్లాసులు నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతిరోజు గంటపాటు బస్సులోని వివిధ భాగాల పనితీరు వివరించడం, ప్రతి ఒక్కరిచేత 10–15 కిలోమీటర్లు బస్సును నడిపించడం, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాల తీరును చూపించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరంగా చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 99592 25774, 73828 65145 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హాకీ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో ఆదివారం హాకీ ఆంధ్రప్రదేశ్ సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా డి.వి. కరుణకుమార్ (కర్నూలు), కార్యదర్శిగా ఎస్.సుభాన్‌బాషా (కడప)లను ఎన్నుకున్నారు. వీరితో పాటు దివ్యకోటి, నోయల్‌లను ఉపాధ్యక్షులుగా, టి.లక్ష్మణ్ కుమార్, వెంకటపద్మలను సంయుక్త కార్యదర్శులుగా, ఎం. మల్లికార్జునను కోశాధికారిగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సింహాద్రి యాదవ్, దేవకుమారి, బాలాజీ, సుబ్బయ్య, పి. రసూల్, జీలాని, గురుభాస్కర్, నాగేశ్వరరావు, మంజు, నిర్మల, మొయినుద్దీన్ అహ్మద్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు న్యాయాధికారిగా సుబ్బారెడ్డి, పరిశీలకులుగా శ్రీనివాసులు, ముబీన్‌లు వ్యవహరించారు.అనంతరం హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. సుభాన్‌బాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో హాకీ క్రీడకు పూర్వవైభవం తీసుకువస్తామని తెలిపారు.

వాన కురిసే..రైతు మురిసే..

- జిల్లా వ్యాప్తంగా వర్షం
- కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు



వైఎస్సార్ జిల్లా రాజుపాలెం వద్ద పొంగిపొర్లుతున్న రాజోలి ఆనకట్ట

రాయచోటి : గత రెండు నెలలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్న తరుణంలో అన్నమయ్య జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. జిల్లాలోని 30 మండలాల పరిధిలో వర్షం కురిసింది. దీంతో ఆయా మండలాల్లో వాతావరణం చల్లబడింది. రాయచోటి, పీలేరు, రాజంపేట, మదనపల్లి డివిజన్ల పరిధిలో ఖరీఫ్ సీజన్లో 10 వేల హెక్టార్లలో విస్తీర్ణం వరిసాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతులు వరి నారుమళ్లు తయారు చేసుకుని సిద్ధంగా ఉన్నప్పటికీ గత రెండు నెలలుగా చినుకు జాడ లేకపోవడంతో వరి నాట్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో బోరు బావుల కింద 3 వేల హెక్టార్లలోపే వరి సాగు చేయాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 60 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా 13 వేల హెక్టార్లకు మాత్రమే సాగైంది. వరి, వేరుశనగ ఇతర పంటలు సైతం తీవ్ర వర్షాభావం కారణంగా ఎండుముఖం పట్టాయి. ఈ దశలో కురిసిన వర్షం వాటికి ప్రాణం పోశాయని చెప్పవచ్చు. తగినంత వర్షం లేక పలు మండలాల్లో నారుమళ్లు ఎండిపోయాయి. వ్యవసాయాధికారుల సూచన మేరకు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి

వైఎస్సార్ జిల్లాలో..

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లాలో నెల రోజులుగా ఎండల అందరకొట్టాయి. ఫలితంగా జనాలు ఉక్కకు అల్లాడిపోయారు. ఈ క్రమంలో ఉన్నట్లుండి ఒక్కసారిగా ఆకాశమంతా మేఘావృతమై చల్లటి గాలులతో శనివారం రాత్రి 10 గంటలకు వర్షం మొదలైంది. జిల్లా అంతట అదరగొట్టింది. దాదాపు రాత్రంతా వర్షం పడుతూనే ఉండింది. దీంతో కడప నగరంతోపాటు జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతోపాటు పలుచోట్లు వంకలువాగులు పొంగి పోర్లాయి. జిల్లాలోని కొండాపురం, పెద్దముడియం మండలాల పరిధిలో అత్యధికంగా 159.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. పెద్దముడియం మండలంలోని గుండ్లకుంట గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో గ్రామంలో మోకాళ్లలోతు వర్షపునీరు ప్రవహించింది. ఈ వరదనీటితో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే అదే నియోజవకర్గంలోని ఇసుకవంక వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలు ఆగిపోయాయి. కర్నూల్ నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఈ వరదనీటిలో చిక్కుకుంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 13 మంది ప్రయాణికులతోపాటు బస్సు డ్రైవరు, కండక్టర్లు వరదనీటిలో చిక్కుకున్నారు. దీంతో జమ్మలమడుగు సీఐ సదాశివయ్య సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి అందరినీ సురక్షితంగా బయటకు తీశారు.

వర్షం రాకతో అన్నదాతల్లో హర్షం...

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో సీజన్‌లో 27,857 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు. ముఖ్యంగా వర్షాధారంగా చాలా చోట్ల వేరుశనగ, సజ్జ, జొన్న వంటి ఆరుతడి పంటలు సాగు చేశారు. నెలకు పైగా వర్షం లేకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ముఖ్యంగా వేరుశనగ, పత్తి పంటలు చాలా మేర ఎండిపోయే దశకు చేరుకున్నాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కురిసిన వర్షంతో పంటలకు మళ్లీ జీవం వచ్చినట్లయింది. ముఖ్యంగా వేరుశనగ, పత్తి, పొద్దుతిరుగుడు, మినుము, సజ్జలు వంటి పంటలకు ఈ వర్షం ఎంతో మేలు. దీంతోపాటు నదీపరివాహక, బోర్ల కింద సాగు చేసిన వరిపంటలకు ఈ వర్షం వాటికి టానిక్‌లా పనిచేయనుంది. కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ పంట ఊడలు దిగే దశకు చేరకుంది. ఈ వర్షం వారికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. అలాగే పత్తి పంట, జొన్న, వంటి పంటలకు కూడా ఈ వర్షం ఎంతో ఉపయోగకరమని పలువురు రైతులు తెలిపారు.

- జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌కుగాను 77,105 హెక్టార్ల సాధారణ సాగు ఉండగా ఇప్పటివరకు 27,857 హెక్టార్లలో అంటే 36.71 శాతం మేర వివిధ పంటలను సాగు చేశారు.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
గాలివీడు	60.4	ములకలచెరువు	13.2
చిన్నమండెం	56.4	తంబళ్లపల్లి	47.7
సంబేపల్లి	60.4	పెద్దమండెం	28.6
టి.సుండుపల్లి	29.0	గుర్రంకొండ	43.0
రాయచోటి	67.4	కలకడ	40.4
లక్కిరెడ్డిపల్లె	36.4	కేవీ పల్లి	53.8
రామాపురం	32.4	పీలేరు	64.4
వీరబల్లి	43.2	కలికిరి	15.2
నందలూరు	3.2	వాల్మీకిపురం	7.2
పెనగలూరు	4.2	కురవలకోట	20.0
చిట్వేలి	66.2	పీటీ సముద్రం	10.4
రాజంపేట	12.8	కొత్తకోట	8.4
పుల్లంపేట	35.0	మదనపల్లి	27.2
ఓబులవారిపల్లి	29.4	నిమ్మనపల్లి	16.4
కోడూరు	36.0	రామసముద్రం	12.6



రాయచోటి పట్టణంలో కురుస్తున్న వర్షం



మదనపల్లెలో దుకాణాల్లోకి చేరిన వర్షం నీరు



నదిని తలపిస్తున్న కడప ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రహదారి

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: జిల్లా జూనియర్ బాల,బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు దిలీప్, సాగర్, మురళీధర్‌లు ప్రకటించారు. ఎంపికైనవారు కడపలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జూనియర్ బాలికల జట్టు: పి.హరివర్ష, ఎం.తనూజ, ఎ.స్ఫూర్తి, ఆర్.విజయ, చెస్వి, జస్విత, వికిత, సి.పల్లవి, సి.శోభ, ఎం.బిందు, బి.సంగీత, శ్రావణి, అంకిత, అమృత,లక్ష్మి, సుహానా అంజుమ్, వేదప్రియ, ఆయేషా,దీపిక, కీర్తన, అర్షిన్

బాలుర జట్టు: కార్తీక్, నిఖిల్, తరుణ్, సాత్విక్ అఖిల్, రామచరణ్,అక్షయ్, నరేష్, సంతోష్, నికిల్ మిలన్, శివంగ్, లోచన్, హితేష్‌కుమార్‌రెడ్డి, దిలీప్ కుమార్, నాగమోనిష్, ధీరజ్, దర్షన్, కెల్విన్, హరీష్, యశ్వంత్, తాహీర్, వంశీనాయక్, తరుణ్,సాదత్, రజాక్



రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికల జట్టు

గురువులు సమాజానికి మూలస్తంభాలు

- ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రైవేటు ఉపాధ్యాయులకూ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం కడపలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు గంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు ప్రభుత్వానికి కళ్లలాంటివారన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మూలస్తంభాలని కొనియాడారు. వచ్చే ఏడాది అధికారికంగా ఉపాధ్యాయులకు అవార్డులు బహూకరిస్తామన్నారు. చైల్డ్ కేర్ సెలవులు, రూ. 5 లక్షల రుణ సదుపాయానికి తోడ్పాటు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ విద్య అనగానే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ గుర్తుకు వస్తారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌కు ప్రైవేటు ఉపాధ్యాయులపై సదభిప్రాయం ఉందన్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురువులను సత్కరించినపుడే రాష్ట్రం, ప్రాంతం, జిల్లా బాగు పడుతుందన్నారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో ఎక్కువ మంది ప్రైవేటు విద్యా సంస్థలనుంచే ఎంపికయ్యారన్నారు. అనంతరం ఉమ్మడి వైఎస్సార్ కడపజిల్లాలో 100 మంది ఉపాధ్యాయులకు అతిథులు అవార్డులను ప్రదానం చేశారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

సెర్ప్ ఉద్యోగులకు తీపి కబురు

- పెరిగిన జీతాలు ఈ నెల ఉద్యోగుల ఖాతాల్లోకి
- బేసిక్ మీద 23 శాతం పెంపు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 134 మందికి లబ్ధి

మదనపల్లె సిటీ: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో పని చేసే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచింది. సెర్ప్ పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథంలో పని చేసే ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ల ఉన్నతికి విశేషంగా కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీరి జీతాలు పెంచుతూ జీవో 64ను విడుదల చేసింది. బేసిక్ జీతంపై ఏకంగా 23 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెరిగిన ఈ జీతం ఆగస్టు ఒకటి నుంచి వర్తింపజేస్తున్నట్లు జీవోలో పేర్కొంది. దీంతో సెప్టెంబర్‌లో వచ్చే జీతం పెరుగుతుండటంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో కీలకం

జిల్లా డీఆర్‌డీఏ-వెలుగు క్రాంతి పథంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల అభివృద్ధిలో సెర్ప్ పరిధిలోని పని చేసే ఉద్యోగులు కీలకంగా ఉన్నారు. వీరిలో డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం),అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ (సీసీ)ల, అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ)లు 134 మంది ఉన్నారు. వీరిలో చాలా మంది 2002 నుంచి కూడా పని చేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీల అభ్యున్నతికి వీరు కృషి చేస్తున్నారు. వాణిజ్యబ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు వాయిదాలు కట్టించడం, స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వడం, ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు చేసే వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలైన జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత,వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్నపాల వెల్లువ, ఉన్నతి వంటి పథకాలను మహిళల వద్దకు తీసుకుని వెళ్లి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారు. వారి వ్యాపారాలకు మార్కెటింగ్ అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ-యానిమేటర్ల)ను సమన్వయం చేసుకుని సంఘాల ఉన్నతికి కృషి చేస్తున్నారు.



ఇందిరాక్రాంతి పథం కార్యాలయం

సీఎం జగన్ నిర్ణయంతో సంతోషం

వీరు కొన్నేళ్లుగా తమకు జీతాలు పెంచాలని కోరుతూ వస్తున్నారు.దీంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లాలో డీపీఎం, ఏపీఎం, సీసీ, ఏఏలకు జీతాలు పెరిగాయి. బేసిక్ జీతం మీద రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు పెరిగింది. సెర్ప్ పరిధిలో కొందరు 2002 నుంచి పని చేస్తున్నారు. వీరికి గతంలో ఉద్యోగ భద్రత కల్పించింది మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కావడం విశేషం. అప్పట్లో వైఎస్సార్ ఉద్యోగ భద్రత కల్పించగా, ఆయన తనయుడు జగన్ 23 శాతం జీతాలు పెంచి తోడ్పాటు అందించారు.

ఆనందంగా ఉంది



మాకు 23 శాతం జీతం పెంచడం చాలా ఆనందంగా ఉంది. ఆర్థికంగా నిలదొక్కుంటాం. ఉత్సాహంగా పని చేయడానికి ఇదొక అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్ధిదారుడికి చేర్చేందుదకు మరింత కృషి చేస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– సంజీవరాజు,ఏపీఎం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



సెర్ప్ పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఏకంగా బేసిక్ మీద 23 శాతం జీతం పెంచడం హర్షణీయం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం మాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–ఆనందబాబు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా సెర్ప్ ఉద్యోగుల సమాచారం

డీపీఎంలు : 2
ఏపీఎంలు : 21
కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు : 53
అడ్మిన్ అసిస్టెంట్లు : 18
ఎంఎస్‌సిసిలు : 35
కార్యాలయ సిబ్బంది : 5

కేడర్	ఉద్యోగుల సంఖ్య	పాత జీతం	పెరిగిన జీతం
డీపీఎం	2	53,790	66,162
ఏపీఎం	21	50,743	62,414
కమ్యూనిటీ కో ఆర్డినేటర్	53	27,486	33,808
జిల్లా సమాఖ్య కోఆర్డినేటర్	18	25,422	31,269
ఎంఎస్‌సీసీ	35	13,320	16,384
ఆఫీసు సిబ్బంది	5	33,591	41,317

ఢిల్లీ టు కొండమాచుపల్లె!

- 35యేళ్ల తర్వాత గ్రామ సందర్శన
- బాల్యజీవితాన్ని నెమరు వేసుకున్న వైనం
- ముంపు గ్రామంలో విదేశీవ్యవహారాల డైరెక్టర్ స్టేట్స్



శ్రీనివాసులరెడ్డి

రాజంపేట: ఆయన భారతదేశ విదేశీవ్యవహారాలను చక్కబెట్టే అధికారి..అయితేనేం.. సొంతూరును చూడాలన్నతపనతో 35యేళ్ల తర్వాత దేశ రాజధాని ఢిల్లీ నుంచి సోమశిల వెనుకజలాల్లో మునిగిపోయిన కొండమాచుపల్లెకు చేరుకున్నారు. అధికార దర్పం ఎలా ఉంటుందో మండల, జిల్లా స్థాయి అధికారుల్లో తరచూ మనం చూస్తునే ఉంటాం. దేశంలోనే ప్రొటోకాల్ 8వ స్థాయి కలిగిన ఓ అధికారి , కేవలం గన్‌మెన్‌తో ఎటువంటి అధికార దర్పం లేకుండా ఆదివారం మునిగిపోయిన తన పల్లెకు చేరుకున్నారు. ఎవరీయన.. ఏమా కథ.. మీరే చదవండి..

- కొండమాచుపల్లె(ఇప్పుడుసోమశిల ముంపుగ్రామం)శ్రీనివాసులరెడ్డి ఇప్పుడు ఢిల్లీలో విదేశీ వ్యవహారాల శాఖ రాష్ట్రాల విభాగాల డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయన తల్లి లక్షుమ్మ, తండ్రి బుడిగ యానాదిరెడ్డి. వీరి ఏకైకు కుమారుడు. 1988 సెప్టెంబరు 2న ఊరు మునిగిపోవడంతో గ్రామాన్ని ఖాళీ చేసి కుటుంబంతో సహా నెల్లూరుకు వెళ్లిపోయారు. మళ్లీ 35 ఏళ్ల తర్వాత తమ గ్రామాన్ని సందర్శించేందుకు వచ్చారు. అప్పట్లో ఉన్న హైస్కూలు, ప్రాథమిక పాఠశాల, ఎస్ఎస్‌వైఎస్ సంస్కృతి పాఠశాల శిథిలాలను చూసి, చలించిపోయారు.. గ్రామంలో ఆంజనేయస్వామి, భవనారుషి గుడి, రామాలయం నేలమట్టమయ్యాయి. కాగా వరాలమ్మ విగ్రహం ఉంటే దీపంపెట్టి పూజించారు.



సోమశిలబ్యాక్‌వాటర్ మునిగిపోయిన కొండమాచుపల్లెలో రావులమ్మకు పూజ చేస్తున్న శ్రీనివాసులరెడ్డి

తన ఇళ్లు లేకపోయినా తాతల కాలనాటి బావి మాత్రమే అలాగే ఉంది. ఇప్పుడు సోమశిల వెనుకజలాలు వెనక్కిపోవడంతో శిథిలమైన తమ స్వగ్రామంను చూడగలిగారు. తనతోపాటు చిన్ననాటి స్నేహితులు కలిశారు. వారంతా ఒకచోటచేరారు. తీపిగుర్తులను నెమరువేసుకున్నారు.

బాల్యమిత్రునికి సత్కారం..

తమ గ్రామవాసి దేశంలోనే 8వ ర్యాంక్ ప్రొటోకాల్ కలిగిన బాల్యమిత్రుడు శ్రీనివాసులరెడ్డిని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరక్టరు లక్ష్మీనరసయ్య ఘనంగా సన్మానించారు. ఎటువంటి కోచింగ్‌లు లేకుండా స్వయంకృషితో దేశస్థాయిలో అత్యున్నత ర్యాంక్ కలిగిన విదేశీవ్యవహారలశాఖ రాష్ట్రాల డైరెక్టర్‌గా ఉండట పట్ల మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు, రేపు జిల్లాలో వర్షం

రాయచోటి/కడప అగ్రికల్చర్: ఈశాన్య బంగాళాఖాతం పరిసరాల్లో ఏర్పడినన ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో అన్నమయ్య జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది వైఎస్సార్ జిల్లాలో కూడా నేడు, రేపు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞానకేంద్ర ప్రధాన శాస్త్రవేత్త వీరయ్య తెలిపారు. ఇందులో భాగంగా 4వ తేదీన తేలికపాటి నుంచి ఒక మోస్తారు ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 5న ఒక మోస్తారు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్లు కురిసే అవకాశం ఉందన్నారు.

గణపయ్య పండుగ.. ఉపాధి నిండుగ

- వస్తున్నవి వినాయక చవితి ఉత్సవాలు
- పలు రంగాల వారికి చేతినిండా పని
- కార్మికుల్లో హర్షాతిరేకాలు

రాజంపేట టౌన్ : నాణేనికి ఒక వైపే కాదు రెండు వైపులా చూడాలి అంటారు. అలాగే వినాయచవితి ఉత్సవాలు అంటే భక్తిభావం, సందడైన వాతావరణం అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. బొజ్జగణపయ్య పండుగ అంటే అనేక మంది బొజ్జనింపే పండుగ కూడా. హిందువులకు పెద్ద పండుగ సంక్రాంతి. అయితే సంక్రాంతి ప్రధానంగా దుస్తులు, నిత్యావసర సరుకుల వ్యాపారులకు ఆదాయాన్ని ఇస్తుంది. అయితే వినాయక చవితి చిరువ్యాపారులు, వివిధ రంగాల కార్మికులు, రైతుల కడుపు నింపుతుంది. ఈ పండుగ ప్రారంభానికి ముందు నుంచే చాలా మందికి ఉపాధి దొరుకుతుంది. అందువల్ల ఈ ఉత్సవాలపై అనేక మంది ఆశలు పెట్టుకుంటారు. మరో రెండు వారాల్లో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో చవితి వేడుకల సందడి ప్రారంభం కానుంది. ఈ నెల 18న వినాయక చవితి పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 10 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో.. కార్మికులకు 15 రోజుల పాటు ఉపాధి లభిస్తుంది.

కళాకారులకూ మంచి రోజులు

సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక కాలక్షేపానికి, వినోదానికి కొదవలేదనే చెప్పాలి. అందువల్ల అనేక కళలు కూడా అంతరించిపోయాయి. అయితే వినాయక చవితి సందర్భంగా గాన, నృత్య, డ్రమ్స్ వాయించే కళాకారులకు చేతినిండా పని లభించి.. కనీసం రెండు నెలల పాటు వారి కుటుంబాల పోషణ సాఫీగా సాగిపోతుంది. జిల్లాలో వందలాది మంది కళాకారులు కళలనే నమ్ముకొని జీవిస్తున్నారు. వారిలో అనేక మంది కళల ద్వారా వచ్చే ఆదాయంతో జీవించే వారు కూడా లేకపోలేదు. అలాంటి వారికి వినాయక చవితి నిజంగా కడుపు నింపే పండుగ అనే చెప్పాలి. కాగా చవితి ఉత్సవాలు జరిగినన్ని రోజులు పురోహితులకు ఉపాధి లభిస్తుంది.

చిరు వ్యాపారులు, రైతులకు సైతం..

కొన్ని రోజుల పాటైనా ఇబ్బందులు లేకుండా చిరువ్యాపారులు, రైతుల కడుపు నింపేందుకు వినాయక చవితి ఎంతగానో దోహదపడుతుంది. వేడుకలు జరిగినన్ని రోజులు ప్రధానంగా పూలు, పండ్ల వ్యాపారం జోరుగా సాగుతుంది. అందువల్ల వ్యాపారులు, రైతులకు కొంత మేర ఆదాయం సమకూరి, వారి కుటుంబ పోషణకు ఉపయోగ పడుతుంది.

కార్మికుల జీవనం సాఫీగా..

అసంఘటిత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఇందులో ఎలక్ట్రీషియన్, దినసరి కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లకు చేతినిండా పని దొరుకుంది. ఇందువల్ల చవితి ఉత్సవాలు జరిగినన్ని రోజులు అసంఘటిత కార్మికుల్లో కొంత మంది జీవనం సాఫీగా సాగిపోతుంది.



వినాయకుడి విగ్రహం

ఎక్కువ రోజులు ఉపాధి



పురోహితులకు ఏడాదిలో చాలా నెలలు పని ఉండదు. కొన్ని రోజుల పాటు పురోహితులందరికీ ఉపాధి దొరికే పండుగ ఏదైనా ఉంది అంటే.. అది వినాయక చవితే అని చెప్పాలి. ఒక పురోహితులకే కాదు అనేక మందికి ఈ సందర్భంగా ఉపాధి లభిస్తుండటం సంతోషకరం.

– హరినాథ్‌శర్మ, పురోహితులు, రాజంపేట

కళను నమ్ముకొని జీవిస్తున్నాం



పాటలు పాడటం, యాంకరింగ్, డ్యాన్స్ చేయడం వంటి కళను నమ్ముకొని అనేక మంది జీవనం సాగిస్తున్నాం. స్టేజీ కళాకారులకు వినాయక చవితి నిజంగా కడుపునింపే పండుగ. ఈ ఉత్సవాల సందర్భంగా మాకు ఉపాధి దొరుకుతుంది. అందువల్ల స్టేజీ కళాకారులందరూ నాలుగు డబ్బులు సంపాదించుకోగలరు.

– నాగ, నృత్య కళాకారుడు, రాజంపేట

వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాం



వినాయక చవితి పండుగ కోసం విగ్రహాలు విక్రయించే వ్యాపారులందరూ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో విగ్రహాలను పెడుతున్నారు. అందువల్ల మాలాంటి వారికి కొంత మేర ఆదాయం వస్తుంది. అందువల్ల కొంత కాలం మా జీవనం సాఫీగా సాగిపోతుంది.

– హరి, వినాయక విగ్రహాల వ్యాపారి, రాజంపేట

క్లుప్తంగా

వైఎస్‌ఆర్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్త దాడి



గాయపడిన వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలు

గాలివీడు : మండల కేంద్రంలోని చిలకలూరిపేటలో వున్న వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలు చిన్నరెడ్డప్ప, పుష్పలత, వారి కుటుంబ సభ్యులపై టీడీపీ కార్యకర్త అమృత నాయుడు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచాడు. వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడ్డ మనేశ్వర్

పీలేరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పీలేరు పట్టణంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. స్థానిక మోడల్ కాలనీలో నివాసముంటున్న మనేశ్వర్ (37) పెయింటింగ్ పని చేసుకుని జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి పీలేరు పట్టణం కడప రోడ్డు మార్గంలో బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మనేశ్వర్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హేమసుందరం తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సుభాన్‌వల్లి మృతదేహం

సిద్దవటం : మండల పరిధి మాధవరం-1 గ్రామ పంచాయతీలోని మహబూబ్ నగర్‌కు చెందిన షేక్ సుభాన్‌వల్లి(18) అనే యువకుడు ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్ నగర్‌కు చెందిన షేక్ కమాల్‌బాషా, గౌసియాల కుమారుడు అయిన సుభాన్‌వల్లి కడప నగరంలో బైక్ మెకానిక్ వద్ద పని చేస్తుండే వాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

విషద్రావణం తాగి..



ఇమాంసాబ్ మృతదేహం

చిన్నమండెం : మండలంలోని టి.చాకిబండ కస్పాకు చెందిన షేక్ ఇమాంసాబ్(65) అనే వృద్ధుడు విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇమాంసాబ్ వయసు రీత్యా పలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతుండే వాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గుర్తించిన బంధువులు రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు అన్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

హై'కోర్టు'లో రాజంపేట బార్ ఎన్నికల బంతి !

- హైకోర్టుకు చేరిన ఓట్ల లెక్కింపు
- తొలగించిన ఓట్లు లెక్కింపు
- వీడని ఉత్కంఠ



రాజంపేట బార్ అసోసియేషన్ కార్యాలయం

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాల వ్యవహారం బంతి.. హై'కోర్టు'కు చేరింది. ఉభయ జిల్లాల్లో ఒక్క రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల వ్యవహారం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఎక్కడా లేని విధంగా కొంత మంది న్యాయవాదుల పేర్లు ఓటర్ల జాబితాలో లేకపోవడం ఫలితంగా.. అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇందులో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, హైకోర్టుకు వెళ్లడం లాంటి సంఘటనలతో న్యాయవాదుల మధ్య బార్ ఎన్నికలు వివాదాన్ని చెలరేగించాయి.

జిల్లా న్యాయవాద వర్గాల్లో హాట్‌టాపిక్

ఎట్టకేలకు హైకోర్టు ఆదేశాలతో కడప కోర్టులో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసింది. ఇందులోనే తొలగింపుగా చెపుతున్న ఓట్ల లెక్కింపు కూడా జరిగాయని సమాచారం. సీల్డ్ కవర్‌లో ఫలితాలు హైకోర్టుకు వెళ్లాయని న్యాయవాదులు అంటున్నారు. దీంతో ఫలితాలు ఎవరికి అనుకూలంగా ఉన్నాయో అనే అంశంపై న్యాయవాద వర్గాల్లో హాట్‌టాపిక్ కొనసాగుతోంది.

పోలింగ్.. కౌంటింగ్.. ఇక ఫలితాలే..

ఈ ఏడాది మార్చి 31న రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలకు పోలింగ్ నిర్వహించారు. బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచారు. అయితే భద్రతపరమైన అంశంపై అనుమానాలు రావడంతో ఒక వర్గం న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టులో వాటిని భద్రపరచాలని ఆదేశించడంతో.. బ్యాలెట్ బాక్స్‌లను ఎన్నికల అధికారి చేర్చారు.

హైకోర్టు ఆదేశంతో.. సీల్డ్‌కవర్‌లో..

హైకోర్టు ఆదేశంతోనే ఎన్నికల ఓట్ల లెక్కింపు చేసి, సీల్డ్‌కవర్‌లో హైకోర్టుకు పంపించినట్లు న్యాయవాదులు అంటున్నారు. అధికారికంగా హైకోర్టు ఫలితాలను ప్రకటిస్తుందని తెలుస్తోంది.

ఎవరెరు పోటీ పడ్డారంటే..

రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధానంగా రెండు ప్యానళ్లు పోటీపడ్డారు. ఒక ప్యానల్‌కు సంబంధించి అధ్యక్షునిగా సురేంద్రబాబు, జనరల్ సెక్రటరీగా జాఫర్‌బాషా, జాయింట్ సెక్రటరీగా సుందర్‌కుమార్‌రాజు, మరో ప్యానల్ నుంచి లక్ష్మీనారాయణ (ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు), జనరల్ సెక్రటరీగా ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా గోపాల్‌రెడ్డిలు పోటీగా నిలిచారు. వీరికే పోలింగ్ జరిగింది. ఓటరు లిస్టు ప్రకారం 102 ఓట్లకు గాను 99 పోల్ అయ్యాయి. తొలగింపు ఓట్లు 26కి గాను 22 పోల్ అయ్యాయి. ఈ ఓట్ల విషయం వివాదానికి ప్రధాన కారణమైన సంగతి తెలిసిందే.

కౌంటింగ్ రిజల్ట్ హైకోర్టులో ఉంది



రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు సంబంధించి కౌంటింగ్ రిజల్టును హైకోర్టుకు చేర్చాం. ఈ నెల 19న జిల్లా కోర్టులో కౌంటింగ్ జరిగింది. షీల్డు కవర్‌లో హైకోర్టుకు పంపాను. ఫలితాలపై హైకోర్టు నిర్ణయం వెలువరించాల్సి ఉంది. బుధవారం వాయిదా ఉంది.

– బాలాజీ, ఎన్నికల అధికారి, రాజంపేట

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కొండాపురం : తాళ్లప్రొద్దుటూరులో హత్యాయత్నం కేసులో నిందితుడు కటిక నారాయణస్వామిని ఆదివారం అరెస్ట్ చేశారు. ఆ గ్రామంలో రెండు రోజుల క్రితం సుబ్బరాయుడు తన అంగడి వద్దకు ట్రాక్టర్‌లో రేకులు తీసుకుని వస్తుండగా.. పక్కకు పో అని కటిక నారాయణస్వామిని అన్నారు. వారిద్దరి మధ్య మాట కుమాట పెరిగి ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని శనివారం నారాయణస్వామి కత్తితో సుబ్బరాయుడుపై దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భర్త దాడిలో గాయపడ్డ భార్య మృతి



లక్ష్మీదేవి(ఫైల్)

మదనపల్లె : పట్టణంలోని బాపూజీ పార్కు వద్ద నాలుగు రోజుల క్రితం భర్త నరకడంతో.. తీవ్రంగా గాయపడిన భార్య చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన పారపట్ల రఘు, లక్ష్మీదేవి(53)లు కుటుంబ పోషణ కోసం పట్టణంలోని సీటీఎం రోడ్డు, బాపూజీ పార్కు సమీపంలో నివాసం ఏర్పరచుకుని స్థిరపడ్డారు. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు జరగడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఏడాది కాలంగా లక్ష్మీదేవి భర్త రఘుకు దూరంగా బంధువుల ఇంట్లో ఉంటోంది. భర్త బాగోగులు పట్టించుకోకుండా ఉండటంతో రఘు పలు మార్లు లక్ష్మీదేవిని తీరు మార్చుకోవాల్సిందిగా హెచ్చరించాడు. అయినప్పటికీ ఆమెలో మార్పు లేకపోవడంతో గురువారం వేకువజామున ఇంటి ముందు చెత్త ఊడ్చేందుకు వచ్చిన భార్య లక్ష్మీదేవిని కొడవలితో అతి కిరాతకంగా నడిరోడ్డుపైనే నరికి వెళ్లిపోయాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆమెను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్సల కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. ఆదివారం మృతి చెందింది. నిందితుడు రఘును పోలీసులు అరెస్ట్ చేశారు.

టీడీపీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాల వారు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పాలెం గొల్లపల్లెలో టీడీపీని వీడి 20 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీటీసీ కోదండ శ్రీలత, శంకర్ నాయుడు ఆధ్వర్యంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరామన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో రాయచోటి జిల్లా కేంద్రం కావడం, నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుండటం హర్షదాయకమన్నారు. పార్టీలో చేరిన వారిలో బొకసం వెంకటాద్రి నాయుడు, బి.శేఖర్ నాయుడు, బి.నడిపిరెడ్డన్న, బి.మల్లేష్ నాయుడు, బి.నరసింహులు నాయుడు, బి.నాగరాజ, రామాంజులు నాయుడు, కోదండ సభాపతి నాయుడు, మల్లికార్జున నాయుడు, గుండు, అంజి, దొరస్వామి నాయుడు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, సర్పంచ్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య యాదవ్, వెంకటాద్రి నాయుడు, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, నాగముని, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ రాకతో వరుణుడు పరారీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రాయలసీమలో యాత్రల పేరిట ప్రతిపక్షనేత చంద్రబాబు, లోకేష్ పర్యటించడంతో వరుణదేవుడు భయపడి వెనక్కి పోయాడని ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి ప్రేమికులు భూమిపై నడుస్తుంటే వరుణుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిపిస్తారన్నారు. చంద్రబాబు, లోకేష్‌లాంటి ప్రకృతి విధ్వంసకులు నేడు యాత్రల పేరిట భూమిపై నడవటం వల్ల వరుణుడు మొఖం చాటేసిన పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్ల రాష్ట్రంలో కరువు రక్కసి కరాళ నృత్యం చేసిందన్నారు. దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఏటా సమృద్ధిగా వర్షాలు కురిశాయని, రైతులు పంటలు పండించుకొని సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఈ ఏడాది రాయలసీమలో చంద్రబాబు, లోకేష్ పర్యటనల వల్లే వర్షం రాక ఆలస్యమైందన్నారు. నిన్నటికి నిన్న దివంగత వైఎస్సార్ వర్ధంతి రోజున ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో అడుగు పెట్టడంతో కుండపోత వర్షం కురిసిందన్నారు. పాలకులు మంచివారైతే ప్రకృతి కూడా సహకరిస్తుందని పెద్దలు చెబుతుంటారన్నారు. చంద్రబాబు ప్రజలకు మేలు చేయడు కాబట్టే ఆయన పాలనలో వర్షాలు కురవవన్నారు. 2024లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురుస్తాయని, రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, క్రిష్ణయ్య, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో చిక్కుకున్న 8 మంది సురక్షితం



చెన్నూరు పెన్నా నది వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు



నది నుంచి బయటకు వచ్చిన వారితో అధికారులు

చెన్నూరు : చెన్నూరు పెన్నానదిలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా నీటి ఉధృతి ఎక్కువ కావడంతో చిక్కుకున్న 8 మంది సురక్షితంగా బయటికి వచ్చారు. చెన్నూరు కొత్త గాంధీనగర్‌కు చెందిన వెంకటసుబ్బయ్య, రాజు, రమణ(పెద్దోడు), పెద్ద వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, శీను, రమణ, రాజేష్ పెన్నా నదిలో నడుచుకుంటూ షికారుకు వెళ్లారు. నీటి ఉధృతి ఎక్కువ కావడంతో అందులో చిక్కుకున్నారు. వారు పెద్ద పెట్టున అరవడంతో నది బ్రిడ్జిపై వెళుతున్న వాహనదారులు గమనించి చెన్నూరు, ఖాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చెన్నూరు ఏఎస్ఐ జాకీర్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ జగన్ నాయక్, శ్రీకాంత్, రాజు స్పందించారు. బ్రిడ్జిపై నుంచి తాళ్ల సాయంతో తొలుత నలుగురు యువకులను తీసుకు వచ్చారు. అనంతరం మరో నలుగురి కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టిన మైదుకూరు రూరల్ సీఐ, సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ బోటు సాయంతో బయటికి తీసుకు వచ్చారు. గల్లంతైన వారు బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సహాయక చర్యలను కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, మైదుకూరు సీఐలు పర్యవేక్షించారు.

కడప రిమ్స్ పరిధిలో చాపాడు వాసి మృతి



మృతి చెందిన మెకాయిల్

కడప అర్బన్ : కడప రిమ్స్ ఆసుపత్రి సమీపంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ముందు ఆదివారం చాపాడుకు చెందిన బియ్య మెకాయిల్(65) అనే వ్యక్తి మృతి చెందాడు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందుకున్న కడప రిమ్స్ పీఎస్ ఎస్ఐ నారాయణ, తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతని జేబులో ప్రొద్దుటూరు డిపోకు చెందిన బస్సు నుంచి పల్లవోలు గ్రామం నుంచి కడపకు వచ్చినట్లు టికెట్ ఉంది. దీంతో మృతుడు ప్రొద్దుటూరు లేక చాపాడుకు చెందిన వ్యక్తి అయివుంటాడని భావించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మీడియా గ్రూపుల్లో వచ్చిన ఫోటో మృతుని కుటుంబ సభ్యులకు కూడా చేరింది. దీంతో వారు రాత్రి రిమ్స్ ఎస్ఐతో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం ఉదయం రిమ్స్‌కు రావాలని ఆయన వారికి సూచించారు. ఇంటి నుంచి ఆసుపత్రికి వెళుతున్నానని చెప్పిన తమ తండ్రి మృతిచెందడంతో అతని కుమారుడు, కుమార్తెలు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆటో, కారు ఢీకొని..

– ఒకరి మృతి, నలుగురికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన ఆటో



మృతి చెందిన సుబ్బరాయుడు

చాపాడు : మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని చాపాడు మండలం అల్లాడుపల్లె క్రాస్ రోడ్డు పెట్రోలు బంకు సమీపంలో ఆదివారం సాయంత్రం ఆటో, కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చాపాడు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు నుంచి ప్రొద్దుటూరుకు ప్రయాణికులతో ఆటో వెళ్తోంది. వెనుకవైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలోని చాపాడు మండలం పల్లవోలుకు చెందిన బాలాయపల్లె సుబ్బరాయుడు (59), ఆటో డ్రైవర్ పత్తూరు పీటర్, రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి చెందిన బషీరూన్, మహబూబ్, ప్రొద్దుటూరు మండలం అమృతానగర్‌కు చెందిన మోదిన్ అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బరాయుడు మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

బద్వేలులో అనసూయ సందడి



మాట్లాడుతున్న యాంకర్, సినీనటి అనసూయ

బద్వేలు అర్బన్ : ప్రముఖ యాంకర్, సినీనటి అనసూయ భరద్వాజ్ ఆదివారం బద్వేలులో సందడి చేశారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని శ్రీ సీవీఎస్ మౌళిక శిల్క్స్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమెను చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా ఆమె అభిమానులకు అభివాదం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా లక్ష్మీదేవి శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సీవీఎస్ మౌళిక శిల్క్స్ అధినేత చెన్నావెంకటేశు తదితరులు వస్త్రదుకాణం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ఆలయానికి 1.5 కిలోల వెండి వితరణ



అంకాలమ్మ ఆలయ చైర్మన్‌కు వెండిని అందజేస్తున్న దాతలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీఅంకాలమ్మ ఆలయంలోని గర్భగుడి ముఖద్వారానికి వెండి తోరణం ఏర్పాటు చేసేందుకు ఓ భక్తుడు 1.5 కిలోల వెండిని వితరణగా అందజేశారు. స్థానిక వెంకటనారాయణరెడ్డి, గంగాదేవి దంపతుల కుమారుడు పల్లేటి అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రసూన దంపతులు, మనువడు వెంకట అక్షిత్‌సాయిరెడ్డిలు ఆదివారం శ్రీఅంకాలమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకటిన్నర కిలోల వెండిని ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ఇంటి ఇలవేల్పు అంకాలమ్మ తల్లి అని తెలిపారు. అనంతరం వారిని ఆలయ చైర్మన్ ఆలయ మర్యాదలతో శాలువ, పూలమాలతో సత్కరించారు. అలాగే దాత సోదరుడు అరుణ్‌కుమార్‌రెడ్డి, లావణ్య దంపతులు, చిన్నారులు అన్విజ, ఆకాంక్షలను అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సురేష్, ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, రాజు, బాబురెడ్డి, మోహన్, రాముడు, వరలక్ష్మి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.